సాక్షి
ఆదిలాబాద్
బుధవారం । 13 । ఆగస్టు । 2025



కుడి.. ఎడమైతే!

కుడిఎడమైతే పొరపాటు లేదోయ్..అన్నాడో సినీ కవి. అంటే వ్యక్తిలోని భిన్నత్వాన్ని బట్టి ప్రత్యేకతను ఆపాదిస్తాం. నేడు వరల్డ్ లెఫ్ట్ హ్యాండర్స్‌డే నేపథ్యంలో కథనం. 8లో▸



మూగజీవాలు బలి

విద్యుదాఘాతానికి గురై మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా అనేక పశువులు చనిపోతున్నాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

కేంద్ర మంత్రిని కలిసిన ఎంపీ నగేశ్



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ నగేశ్

ఆదిలాబాద్: కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ మంగళవారం ఢిల్లీలో కలిశారు. నియోజకవర్గ పరిధిలో పీఎంకేఎస్‌వైలో ప్రతిపాదించిన 34 చెరువులను చేర్చాలని వినతిపత్రం అందజేశారు. రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు వస్తే త్వరగా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

వర్సిటీ ఏర్పాటు కోసం పూజలు



పూజలు నిర్వహిస్తున్న సాధన సమితి సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో విశ్వవిద్యాలయం ఏర్పాటు కోసం యూనివర్సిటీ సాధన సమితి సభ్యులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రిమ్స్ ఆవరణలోని మహా గణపతి ఆలయంలో నిర్వహించిన పూజల్లో ఆలయ నిర్వాహకులు ఓంప్రకాశ్ పంతులు, సాధన సమితి కన్వీనర్ పురుషోత్తంరెడ్డి, అక్షయ్‌తో పాటు భక్తులు పాల్గొన్నారు.

ఎండీఎం కార్మికుల సమ్మె వాయిదా

కైలాస్‌నగర్: పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలనే డిమాండ్‌తో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్లుగా ఆ సంఘం రాష్ట్ర నాయకుడు కుంటాల రాములు ప్రకటనలో తెలిపారు. వారం రోజులుగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరసనను మంగళవారం విరమించినట్లు పేర్కొన్నారు. ఈ నెలాఖరులోగా ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సెప్టెంబర్ ఒకటి నుంచి తిరిగి రాష్ట్రవ్యాప్త సమ్మె చేపడుతామని వెల్లడించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. కార్మికులతో కలిసి రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇందులో కార్మికులు సురేందర్, పొచ్చన్న, దశాంత్, రమేశ్, రమాకాంత్, అరుణ్, సంతోష్ తదితరులు ఉన్నారు.

ఐటీడీఏ అక్రమాలపై విచారణ జరిపించాలి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న సుమేష్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఐటీడీఏలో జరుగుతున్న అవినీతి, అక్రమాలతో పాటు ఎస్టీ రిజర్వేషన్ ఉల్లంఘనలపై జాతీయ ఎస్టీ కమిషనర్ హుస్సేన్‌నాయక్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు ఏజెన్సీడీఎస్సీ సాధన కమిటీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సభ్యుడు జాదవ్ సుమేష్ తెలిపారు. ఏజెన్సీ ప్రాంత గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి వందశాతం ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని, జీవో నంబర్ 3 పునరుద్ధరించి అన్ని హక్కులు గిరిజనులకే కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఆయన వెంట దేవురావ్, కుమార్ పాల్గొన్నారు.

ఫుల్ గిరాఖీ



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

- ఆర్టీసీకి కలిసి వచ్చిన వరుస సెలవులు
- 'పౌర్ణమి' రోజున రూ.2.89 కోట్ల ఆదాయం
- రీజియన్ వ్యాప్తంగా రూ.9.26 కోట్ల ఆమ్దాని

రీజియన్ పరిధిలో ఇలా..
(ఈనెల 7 నుంచి 11వ తేదీ వరకు)

డిపో	బస్సులు ప్రయాణించిన కి.మీ.(లక్షల్లో)	ఆదాయం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	3.22	2.15
భైంసా	1.47	0.90
నిర్మల్	3.47	2.49
ఉట్నూర్	0.77	0.53
ఆసిఫాబాద్	1.69	1.06
మంచిర్యాల	3.31	2.13
రీజియన్	13.93	9.26

ఆదిలాబాద్: వరుస సెలవులు, పండుగలు ప్రజారవాణా సంస్థకు ఆదాయాన్ని తెచ్చిపెట్టాయి. ఈనెల 8న వరలక్ష్మీ వ్రతం, 9న రాఖీపౌర్ణమి, 10న ఆదివారం కలిసి రావడంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల తాకిడి ఒక్కసారిగా పెరిగింది. ఈ నెల 7నుంచి 11వరకు రీజియన్ వ్యాప్తంగా ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్) 101 నమోదవడం రద్దీ తీరుకు నిదర్శనం. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆరు డిపోల పరిధిలో ఐదు రోజుల వ్యవధిలో ప్రతీ కిలోమీటర్‌కు రూ.66.48 ఆదాయం వచ్చింది. మొత్తం 639 బస్సులు 13,93,000 కిలోమీటర్లు తిరిగి 18.84 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు. జూలై నెలలో ఒక్క సాధారణ రోజు ఇన్‌కమ్ రూ.1.85 కోట్లుగా ఉంది. అయితే రాఖీ పండుగ ఒక్కరోజే రీజియన్ వ్యాప్తంగా రూ.2.89 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం. గతేడాది ఈ పండుగకు రూ.1.57 కోట్ల ఆదాయం రాగా ఈ సారి అదనంగా మరో రూ.1.32 కోట్లను ఆర్జించి ఆర్టీసీ రికార్డు సృష్టించింది. మొత్తంగా ఐదు రోజుల్లో రీజియన్ పరిధిలో రూ.9.26 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో అత్యధికంగా నిర్మల్ డిపో రూ. 2.49 కోట్లతో అగ్రస్థానంలో నిలిచింది.

అగ్రస్థానంలో నిర్మల్ డిపో..

ఐదు రోజుల్లో నిర్మల్ డిపో రూ.2.49 కోట్ల ఆదాయంతో అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది రూ.1.25 కోట్లతో సరిపెట్టుకోగా, ఈసారి రెట్టింపు సమకూర్చుకోవడం విశేషం. గతంలో రూ.కోటి 80 వేల ఆదాయంతో నిలిచిన ఆదిలాబాద్ ఈసారి పుంజుకుని రూ.2.15 కోట్లకు చేరుకుంది.

ముందస్తు ప్రణాళికతో..

వరుసగా రెండు పండుగలు, ఆదివారం కూడా తోడవడంతో రద్దీని ముందే పసిగట్టిన ఆర్టీసీ అధికారులు పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగారు. ఉమ్మడి జిల్లాకు సరిహద్దున ఉన్న మహారాష్ట్ర ప్రాంతాలతో పాటు ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి ప్రయాణికుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. తదనుగుణంగా యాజమాన్యం ప్రత్యేక బస్సులను నడిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌కు 118 స్పెషల్ సర్వీస్‌లను ఏర్పాటు చేశారు. రద్దీకి అనుగుణంగా 7, 8 తేదీల్లో హైదరాబాద్ నుంచి ఉమ్మడి ఆదిలాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు 46 బస్సులు ఏర్పాటు చేయగా, 10 నుంచి 12వ తేదీ వరకు రీజియన్ నుంచి హైదరాబాద్‌కు 72 బస్సులను ఆపరేట్ చేశారు. అంతే కాకుండా ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌లను అందుబాటులో ఉంచారు. అలాగే ఉద్యోగుల ఇబ్బందులను సైతం పరిగణలోనికి తీసుకొని ఈ సారి వారికి ప్రత్యేక భోజన వసతి ఏర్పాటు చేశారు. ఫలితంగా ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడంతోపాటు ఆర్టీసీకి ఆమ్దాని వచ్చింది.

తమ సోదరులకు రాఖీ కట్టేందుకు దూర ప్రయాణమైనా మహిళలు ఆర్టీసీలో ప్రయాణించడం

'మహాలక్ష్మి'లే అధికం..

సంస్థకు లాభించింది. ఐదు రోజుల వ్యవధిలో మొత్తం 18.84 లక్షల మంది ప్రయాణించగా, అందులో 12.60 లక్షల మంది 'మహాలక్ష్మి'లే ఉన్నారు. అత్యధికంగా పౌర్ణమి రోజున 4.27 లక్షల మంది ప్రయాణించగా, ఇందులో 2.93 లక్షల మంది మహాలక్ష్మి లబ్ధిదారులున్నారు. ఇక ఆక్యుపెన్సీ రేషియో విషయానికి వస్తే ఉట్నూరు డిపో పరిధిలో అత్యధికంగా 109 ఉండగా, నిర్మల్ 106, భైంసా 102, ఆదిలాబాద్ 101, మంచిర్యాల 97,ఆసిఫాబాద్ 95గా నమోదయ్యాయి.

ప్రయాణికులను సురక్షితంగా చేర్చాం..



వరలక్ష్మీ వ్రతం, రాఖీ పండుగలను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా బస్సులను ఆపరేట్ చేశాం. సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాం. ఉద్యోగులు ఎంతగానో కృషి చేశారు. ఆదాయం సైతం గతంతో పోలిస్తే ఘననీయంగా పెరిగింది. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

– ఎస్. భవానీప్రసాద్, ఆర్ఎం, ఆదిలాబాద్

డీసీసీ ఇప్పట్లో లేనట్టే..!

- జిల్లా అధ్యక్షుడి నియామకం మరింత ఆలస్యం
- అన్నిరకాల కమిటీలు కూడా..
- 'స్థానిక' ఎన్నికల తర్వాతేనని ప్రచారం
- 'హస్తం' శ్రేణుల్లో నిరాశ

సాక్షి,ఆదిలాబాద్: 'త్వరలో పార్టీ పదవుల కేటాయింపు ఉంటుంది.. జెండా మోసిన కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు లభిస్తుంది.. బూత్ స్థాయి నుంచి అన్నిరకాల కమిటీల బలోపేతానికి చర్యలు తీసుకుంటాం.. వాటికి పునర్ వైభవం తీసుకురావడమే మా ముందున్న లక్ష్యం.. జిల్లా అధ్యక్షుడిని నియమిస్తాం..'ఇది కాంగ్రెస్‌పార్టీ పరిశీలకులు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీలు పార్టీ సమావేశాల్లో కార్యకర్తలను ఉద్దేశించి అన్న మాటలు. దీంతో ఇక పార్టీకి మంచి రోజులు రానున్నాయన్న సంతోషం కార్యకర్తల్లో కనిపించింది. మళ్లీ ఏమైందో ఏమో గానీ ఈ విషయంలో స్తబ్దత నెలకొంది. జిల్లా అధ్యక్షుడి నియామకం ఇప్పట్లో లేనట్టేననే సంకేతాలు పార్టీ నుంచి వినిపిస్తున్నాయి. కమిటీల నియామకంపై కూడా స్పష్టత లేదు. దీంతో కార్యకర్తల్లో నైరాశ్యం నెలకొంది. గత ఏప్రిల్, మే నెలల్లో కాంగ్రెస్ పార్టీకి సంబంధించి వివిధ కమిటీల నియామకం కోసం మండల, పట్టణ సమావేశాలను విస్తతంగా నిర్వహించారు. ఆ ప్రక్రియ పూర్తి చేసి ఆయా కమిటీలకుగాను ఒక్కో దానికి ఐదేసి పేర్ల చొప్పున దరఖాస్తులు కూడా స్వీకరించారు. శ్రేణుల్లో హర్షం వ్యక్తమైంది.ఇక పార్టీకి సంబంధించి గ్రామ, మండల, వార్డు, పట్టణ,బ్లాక్ కమిటీలను పూర్తి చేస్తా రని భావించారు. అయితే అధిష్టానం తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా కమిటీలు,డీసీసీ అధ్యక్షుల నియామకంలో ఆసక్తి చూపడం లేదని పార్టీలో ప్రచారం సాగుతుంది.

ఇలా అయితే ఎలా..

రాష్ట్రంలో హస్తం పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించడం లేదు. ప్రధానంగా పార్టీ పరంగా ఎలాంటి కమిటీలు లేకపోవడం, జిల్లాకు దిక్సూచిగా ఉండాల్సిన అధ్యక్షుడి పదవి అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు నుంచి ఖాళీగా ఉండటంపై కార్యకర్తల్లో నిరాశ నెలకొంది. నియోజకవర్గ ఇన్‌చార్జీల ఆధ్వర్యంలో పార్టీ కార్యక్రమాలు సాగుతుండడంతో కొంతైనా ప్రభుత్వ పథకాలపై ప్రచారం జరుగుతుందనే అభిప్రా యం ఉంది. అయితే అన్ని స్థాయిల్లో కమిటీల నియామకం జరిగితేనే పార్టీ బలపడుతుందని, అలాగే కార్యకర్తల్లో ఉత్సాహం కనిపిస్తుందనే టాక్ వినిపిస్తుంది. అయితే అధిష్టానం ఈ విషయంలో వెనుకడుగు వేయడం గమనార్హం.

గ్రూపు తగాదాల నేపథ్యంలోనే..

పార్టీలో గ్రూపు తగాదాల నేపథ్యంలోనే అధిష్టానం రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ జిల్లా అధ్యక్షులు, కమిటీల నియామకంలో మళ్లీ వెనుకంజ వేస్తుందన్న ప్రచారం సాగుతుంది. ప్రతీ నియోజకవర్గంలో నాయకుల మధ్య గ్రూపు తగాదాలు ఉండడంతో ఈ పరిస్థితి ఉందని అభిప్రాయ పడుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కమిటీలు నియమించి, జిల్లా అధ్యక్షుడిని ఖరారు చేస్తే గ్రూపు తగాదాలు మరింత పెరుగుతాయా అనే సందేహం అధిష్టానంలో ఉందని, దీంతోనే రాష్ట్ర వ్యాప్తంగా నిర్ణయానికి ముందడుగు పడడం లేదని ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు. అయితే మిగతా జిల్లాల్లో గతంలో అధ్యక్షులుగా పనిచేసిన వారు ఉండడంతో కనీసం మాజీ జిల్లా అధ్యక్షులు అని చెప్పుకునే పరిస్థితి ఉంది. ఆదిలాబాద్‌లో మాత్రం ఈ పదవి ఏళ్లుగా ఖాళీగా ఉండడంతో అసలు దిశా నిర్దేశం చేసే నాయకత్వం కరువైంది. ఈ నేపథ్యంలోనే జిల్లా పరిస్థితులను పరిగణలోకి తీసుకొని అధ్యక్షుడి నియామకంలో నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయ పడుతున్నారు.

పీఏసీ సమావేశం తర్వాత..

రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలోనూ పార్టీ అధ్యక్షుల నియామకం జరగలేదు. త్వరలో హైదరాబాద్‌లో పీఏసీ సమావేశం ఉంది. అందులో ఏదైన నిర్ణయం జరగవచ్చు.అప్పటివరకు ఏమీచెప్పలేం.

– తాహెర్‌బిన్ హందాన్, పార్టీ జిల్లా పరిశీలకులు

రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శ్రీనివాస్

ఆదిలాబాద్: జిల్లా బేస్‌బాల్ క్రీడాకారులు రాష్ట్రస్థాయిలోనూ సత్తా చాటాలని బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కలాల శ్రీనివాస్ అన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయి బేస్‌బాల్ ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వీరికి బుధవారం నుంచి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. స్థానిక ఐపీ స్టేడియంలోనే ఈనెల 16నుంచి 18వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జ్యోతి, అజయ్, గౌతమ్, నాగరాణి పాల్గొన్నారు.

ఆ ఉపాధ్యాయులపై చర్యలకు సిద్ధం

- జిల్లాలో 'సర్దుబాటు'కు స్పందించని 24 మంది
- నివేదిక కోరిన డీఈవో ఖుష్బూగుప్తా

ఆదిలాబాద్‌టౌన్: సర్దుబాటు ప్రక్రియలో భాగంగా అవసరమున్న పాఠశాలలకు కేటాయించిన ఉపాధ్యాయులు జిల్లాలో 24 మంది విధుల్లో చేరలేదు. ఉన్నతాధికారులు ఇప్పటికే పలుమార్లు ఆదేశాలు జారీ చేసినా పెడచెవిన పెడుతున్నారు. సర్దుబాటు ప్రక్రియలో భాగంగా జిల్లాలో 131 మందిని అవసరమున్న పాఠశాలలకు కేటాయించారు. ఇందులో 107 మంది తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. మిగతా వారిని విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించినప్పటికీ తప్పించుకునేందుకు కారణాలు వెతుకుతున్నారు. అలాగే మండల విద్యాధికారులు పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. దీంతో అలాంటి వారి వివరాలతో కూడిన జాబితాను జిల్లా విద్యాశాఖాధికారి, ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా తీసుకున్నారు. ఆదిలాబాద్ అర్బన్ మండలంలో ఏడుగురు, బోథ్ మండలంలో నలుగురు , ఇచ్చోడలో ఏడుగురు, ఉట్నూర్‌లో ఇద్దరు, నేరడిగొండ, జైనథ్, తలమడుగు, ఇంద్రవెల్లిలో ఒకరు చొప్పున విధుల్లో చేరని ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యాశాఖ అధికారులు వారిని వివరణ కోరగా తమ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని, అనారోగ్యం బారిన పడ్డామని చెబుతున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. ఇలాంటి వారిపైన డీఈవో చర్యలకు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం.

అధికారికంగా పొలాల పండుగ

- ఈ నెల 23న తాంసిలో నిర్వహణ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లపై గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన తిరుమల్‌రావు

తాంసి: జిల్లాలో రైతులు సంప్రదాయంగా భావించే పొలాల అమావాస్య పండుగను ఈ సారి అధికారికంగా నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 23న పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు ఏర్పాట్లను అధికారులు, గ్రామస్తులతో కలిసి కలెక్టర్ రాజర్షి షా మంగళవారం పరిశీలించారు. స్థానిక వాగు, మందిరం స్థలాన్ని పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పొలాల అమావాస్యకు సంబంధించిన లఘు చిత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో వీక్షించారు. పండుగ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఏటా పొలాల పండుగను రైతులు ఘనంగా నిర్వహించుకుంటారని, ఈ సారి రాష్ట్రస్థాయి గుర్తింపు తెచ్చేలా అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులు ఐక్యతగా ఉంటూ ఏర్పాట్లలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ సలహాదారు ప్రొఫెసర్ తిరుమల్‌రావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి రవి, డీఆర్డీవో రాథోడ్ రవీందర్, డీపీవో రమేశ్, మండల ప్రత్యేకాధికారి వెంకటరమణ, ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, గ్రామ మాజీ సర్పంచ్ కృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పొన్నారిలో ఇళ్ల నిర్మాణాలు పరిశీలన..

మండలంలోని పొన్నారి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక కోసం రూ.7వేలు చెల్లిస్తున్నామని వారు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఉచితంగా సరఫరా చేయాల్సిన ఇసుకను అధిక ధరకు విక్రయిస్తుంటే ఏం చేస్తున్నారని ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక అవసరమైన వారికి కూపన్‌లు అందించి సరఫరా జరిగేలా చూడాలని ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మికి సూచించారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ నజీర్, పంచాయతీ కార్యదర్శి గంగన్న, గ్రామస్తులు ఉన్నారు.

అక్రమ లేఅవుట్లలో హద్దురాళ్ల తొలగింపు



పొక్లెయిన్‌తో హద్దురాళ్లు తొలగిస్తున్నారిలా..

కైలాస్‌నగర్: జిల్లాకేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ లేఅవుట్ల ఏర్పాటుతో పాటు అనుమతులు లేకుండా ప్లాట్లను విక్రయిస్తూ రియల్టర్లు సొమ్ము చేసుకుంటున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. అయితే కలెక్టర్ రాజర్షి షా విషయాన్ని గుర్తించి చర్యలకు ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పట్టణంలోని బంగారుగూడ సమీపంలో రియల్టర్లు ఎలాంటి అనుమతులు లేకుండా రెండు లేఅవుట్లను ఏర్పాటు చేశారు. ప్రజలను ఆకర్షించేలా రంగురంగుల జెండాలను పాతారు. అధికారిక పర్యటనలో భాగంగా ఆ మార్గంలో పయనించిన కలెక్టర్ విషయాన్ని గమనించారు. వాటిపై చర్యలకు ఆదేశించారు. వెంటనే మేల్కొన్న టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. పొక్లెయిన్‌తో లేఅవుట్లలో పాతిన హద్దురాళ్లు, జెండాలను తొలగింపజేశారు. కాగా, ఈ చర్యల విషయాన్ని బయటకు రానీయకుండా టౌన్ ప్లానింగ్ అధికారులు గోప్యత పాటించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'ఇందిరమ్మ'కు ఇసుక కొరత రానివ్వద్దు

- ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెల్స్
- అధికారులతో సమీక్షించిన కలెక్టర్

కైలాస్‌నగర్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక, మొరం కొరత రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, వన మహోత్సవం, గృహజ్యోతి, మహాలక్ష్మి, భూభారతి, సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు వంటి అంశాలపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ భవనాలు, ప్రభుత్వ విభాగాలకు చెందిన బహిరంగ స్థలాలపై సౌర విద్యుత్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 100 చదరపు అడుగుల పైకప్పుపై కిలోవాట్ ప్యానెల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇది సగటున రోజుకు నాలుగు యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని తెలిపారు. కిలోవాట్ ఏర్పాటుకు రూ.50వేల నుంచి రూ.60వేల వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. తద్వారా విద్యుత్ ఆదాతో పాటు, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడుతుందన్నారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులకు అ త్యంత ప్రాధాన్యతనిస్తూ పరిష్కరించాలన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి అక్రమ వసూళ్లకు పాల్పడే ఇందిరమ్మ కమిటీ సభ్యులు, ఆయా శాఖల సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రెయినీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

- ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. పట్టణంలోని రణదీవెనగర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఓ ప్రైవేట్ పాఠశాల సౌజన్యంతో బెల్టులు, ఐడెంటిటీ కార్డులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ హాజరై మాట్లాడారు. కష్టపడి చదివితే విజయం సొంతమవుతుందన్నారు. అలాగే ఆరోగ్యంపై దృష్టి సారించాలనానరు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ పార్కు అందుబాటులోకి తీసుకురావాలి

జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల ఆవరణలోని సైన్స్ పార్కును అందుబాటులోకి తీసుకురావాలని ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రా అన్నారు. మంగళవారం సైన్స్ పార్కును పరిశీలించారు. పిచ్చిమొక్కలను తొలగించాలని సిబ్బందికి సూచించారు. సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం భవిత రిసోర్స్ సెంటర్‌ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డైట్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్, కిరణ్, పుష్పవేణి, తదితరులున్నారు.



విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులు అందజేసిన ట్రెయినీ కలెక్టర్ సలోని, తదితరులు

అప్రమత్తంగా ఉండాలి

- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులను ఆదేశించిన కలెక్టర్

కైలాస్‌నగర్: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న అనంతరం అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున 24/7 సిబ్బంది అత్యవసర సేవలకు అందుబాటులో ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ఓవర్ ఫ్లో బ్రిడ్జిల వద్ద పోలీస్ సిబ్బంది భద్రతను పర్యవేక్షించాలన్నారు. జిల్లా ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ 1800 4251939 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్, ట్రెయినీ కలెక్టర్ సలోని, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్: జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని ఎయిడ్స్‌పై అవగాహనలో భాగంగా స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వద్ద వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. యువతకు హెచ్ఐవీపై సంపూర్ణ అవగాహన కల్పించాలనే లక్ష్యంతో అక్టోబర్ 31వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీవైఎస్‌వో జక్కుల శ్రీనివాస్,జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా మలేరియా అధికారి శ్రీధర్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడి చేసిన ఇద్దరిపై కేసు

నెన్నెల: కొత్తూరు గ్రామానికి చెందిన ఎండీ జలీల్‌పై అదే గ్రామానికి చెందిన బోయిని రాజు, కొడిపె మహేందర్ మంగళవారం దాడి చేసినట్లు ఎస్సై ప్రతాప్ తెలిపారు. జలీల్ తన ఇంటి సమీపంలో ఉండగా ఇద్దరు వచ్చి దుర్భాలాషలాడుతూ దాడి చేయడమే కాకుండా ఎప్పటికైనా చంపుతామని బెదిరించారని పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

గంజాయి కేసులో ఇద్దరి అరెస్టు


గంజాయితో పట్టుబడిన వ్యక్తులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పంజాబీ దాబా వద్ద మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసుల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు గంజాయితో పట్టుబడినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. రెబ్బెన మండలం ఖైర్‌గాంకు చెందిన గన్నా శ్రవణ్‌కుమార్, మహారాష్ట్రలోని రాజూరకు చెందిన అరుణ్ రామారావు ముమారే వద్ద నుంచి 60 గ్రాముల (10 ప్యాకెట్లు) గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై రాజు, కానిస్టేబుళ్లు సంజీవ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో నలుగురు..


పోలీసుల అదుపులో నిందితులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో గంజాయి సేవిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు బైపాస్ రోడ్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మంచిర్యాలకు చెందిన శెట్టి రణధీర్, అయిత పవన్‌కళ్యాణ్, ఆవునూరి సన్నీ, గూడెల్లి సాయికుమార్ వద్ద 500 గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. ఇందులో బాబి అనే మరో యువకుడు పరారీలో ఉన్నాడని, నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు..

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సీసీఐ సమీపంలో గల ఖాళీ ప్రదేశంలో బంగారుగూడకు చెందిన అబ్దుల్ రహ్మాన్, ఖానాపూర్‌కు చెందిన షేక్ షబాజ్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్సై నాగనాథ్ దాడి చేసి పట్టుకున్నట్లుగా తెలిపారు. వారి నుంచి 70 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయిని మహారాష్ట్రలోని బోకర్‌కు చెందిన లాలా నుంచి తీసుకువచ్చినట్లుగా వివరించారు.

కాగజ్‌నగర్‌లో వ్యాపారి..

కాగజ్‌నగర్ రూరల్: ఈజ్‌గాం, కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అనేక గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యాపారి శేఖర్ పోర్డాడ్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు ఈజ్‌గాం ఎస్సై కల్యాణ్ తెలిపారు. మహారాష్ట్రలోని ముల్చేరా గ్రామానికి చెందిన శేఖర్ పోర్డాడ్ మహారాష్ట్ర నుండి ఇక్కడికి గంజాయిని రవాణా చేస్తున్నాడని ఎస్సై పేర్కొన్నాడు.

పేకాడుతున్న ఏడుగురు..

ఆదిలాబాద్‌రూరల్: ముండలంలోని దిమ్మ గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వారి వద్ద నుంచి ఏడు మొబైల్ ఫోన్లు, రూ.8,610 నగదుతో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

అశ్లీల వీడియోలు పోస్ట్ చేసిన ఇద్దరిపై కేసు



అరెస్టు చూపుతున్న సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై

రామకృష్ణాపూర్: అశ్లీల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇద్దరు వ్యక్తులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లలో అశ్లీల వీడియోలు పోస్ట్ చేసినట్లు నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లోయిటెడ్ చిల్డ్రన్ (ఎన్‌సీఎంఈసీ) సంస్థ వారు గుర్తించి తెలంగాణ సైబర్ సెక్యూరిటీ వింగ్‌కు సమాచారం ఇచ్చారు. వారు ఆ కేసును తమకు అప్పగించడంతో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

కుడి.. ఎడమైతే!



ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు నిర్మల్ జిల్లాలోని గుండంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు సిలారి మధు, విద్యార్థులు. ఉపాధ్యాయుడితో పాటు పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న దాదాపు పదిమంది విద్యార్థులు ఎడమ చేతివాటం కలిగి ఉన్నారు. పాఠ్యాంశ బోధనలోనూ ఎడమవైపు చేతిద్వారానే అనువుగా ఉంటుందని చెబుతున్నారు. మిగతా వారితో పోల్చితే ఎడమచేతివాటం కలిగిన విద్యార్థులు విద్య, విద్యేతర విషయాల్లో చురుగ్గా ఉన్నారని వారు పేర్కొంటున్నారు.



- నేడు వరల్డ్ లెఫ్ట్ హ్యాండర్స్ డే
- అందరిలో ప్రత్యేకతగా..
- ఉమ్మడి జిల్లాలోనూ ఎడమచేతివాటం వ్యక్తులు

నిర్మల్‌ఖిల్లా: కుడిఎడమైతే పొరపాటు లేదోయ్...అన్నాడో సినీ కవి.. అంటే వ్యక్తిలోని భిన్నత్వాన్ని బట్టి ప్రత్యేకతను ఆపాదిస్తాం. ఎడమ చేతివాటం అనేది జన్యు ప్రభావ ఫలితంగా ఏర్పడిందని వైద్య పరిశోధనలు సైతం రుజువు చేస్తున్నాయి. సమాజంలోని మనుషులలో ప్రతిఒక్కరూ భిన్నమైన గుణాన్ని కలిగి ఉంటారు. అందులో కొందర్ని మాత్రం ప్రత్యేకతను బట్టి సులభంగా గుర్తిస్తాం. చిన్ననాటి నుంచే జన్యు ప్రభావ ఫలితంగానే కుడి, ఎడమ చేతివాటాలు సంభవిస్తాయని సైన్స్ చెబుతోంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ ఎడమ చేతివాటం కలిగినవారు పలువురు ఉన్నారు. నేడు ప్రపంచ ఎడమ చేతివాటం వ్యక్తుల దినోత్సవం (వరల్డ్ లెఫ్ట్ హ్యాండర్స్ డే)గా జరుపుకుంటున్న నేపథ్యంలో సాక్షి కథనం.

ప్రోత్సహిస్తేనే మంచిది..

ఏడాదిన్నర నుంచి రెండేళ్ల మధ్య వయస్సులో పిల్లలు వస్తువులను పట్టుకోవడం మొదలుపెడతారు. ఈ సమయంలోనే కుడి, ఎడమ చేతివాటాలను గుర్తించవచ్చు. ఎడమ చేతి వాటాన్ని తల్లిదండ్రులు ఒక చెడు అలవాటుగా భావించి మాన్పించేందుకు ప్రయత్నం చేస్తారు. అలా చేయడం వల్ల ఇతర సమస్యలు తలెత్తుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కైలాసనగర్ కాలనీకి చెందిన ఈ వ్యక్తి పేరు డి.ప్రశాంత్ కుమార్. ఎంజేపీ గురుకుల విద్యాలయంలో ఆర్ట్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్ననాటి నుంచి ఎడమచేతితోనే అద్భుతమైన చిత్రాలను కళాత్మకంగా గీస్తూ మంచి పేరు సంపాదించారు. బడిలో ఎడమ చేతితో రాస్తుంటే తోటి విద్యార్థులు హేళన చేయడంతో ఎంత మానుకుందామన్నా కుదరలేదని అంటున్నారు. ఈ కళే తనకు ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి పెట్టిందని చెబుతున్నాడు. ఈయన తన ఎడమచేయితో గీసే చిత్రాలు జీవ కళ ఉట్టిపడే విధంగా ఉంటాయి.

కంప్యూటర్ మౌస్ ఆపరేటింగ్ ...



ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నా. సాధారణంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అంటే ఎక్కువ సమయం కంప్యూటర్, ల్యాప్‌టాప్ ముందే గడుపుతారు. కంప్యూటర్ ముందు కూర్చోగానే సాధారణంగా కుడి చేయి మౌస్ పైకి వెళ్తుంది. కానీ నేను మౌస్‌ను ఎడమచేతి ద్వారానే నియంత్రిస్తుండడం విశేషం. నాకు చిన్ననాటి నుంచే ఎడమచేతివాటం అలవాటైంది. దీనివల్ల ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు.

– జీ.ప్రదీప్, కల్లూరు, కుంటాల

క్రికెటైనా..చేతిరాతైనా



ఉపాధి హామీ పథకంలో ఏపీవోగా కుంటాల మండలంలో విధులు నిర్వహిస్తున్నా. చిన్ననాటి నుంచి అన్నిపనులు ఎడమచేతితోనే చేయడం అలవాటయ్యాయి. ఎడమచేతితో చేయడం శుభసూచకంగా భావిస్తున్నా. ఆటస్థలంలో క్రికెట్ ఆడడమైనా, కార్యాలయంలో విధులు నిర్వహించే సమయంలో రాయడానికైనా ఎడమచేతినే ఎక్కువగా ఉపయోగిస్తున్నా. అంతేకాకుండా నా కుమారుడు కూడా ఎడమచేతి వాటం కలిగి ఉన్నాడు.

– గట్టుపల్లి నవీన్, ఏపీవో, కుంటాల

చిన్ననాటి నుంచి ఇలాగే...



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి లెఫ్ట్ హ్యాండ్‌తోనే రాయడం, ఇతర పనులు చేయడం అలవాటైంది. మా తల్లిదండ్రులు కూడా ఎడమచేతి వాటాన్ని ప్రోత్సహించారు. ప్రైవేటురంగంలో పర్యవేక్షణ విధులు నిర్వర్తిస్తున్నా. ఇప్పటి వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తలేదు. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ అలవాటును అలాగే కొనసాగిస్తున్నా.

– వంగ శ్రీనివాస్‌రెడ్డి, ప్రైవేటు ఉద్యోగి, బీరవెల్లి, సారంగపూర్

మస్తిష్క నియంత్రణ అమరిక ఫలితంగానే...



గర్భస్థదశలో శిశువు ఉన్నప్పుడు ఏర్పడిన జన్యు ప్రభావంతోనే ఎడమచేతివాటంగా జన్మిస్తారు. కొందరిలో వంశపారంపర్యంగా, పరిసర కారకాల ప్రభావంతో కూడా ఏర్పడుతుంది. వారు ప్రతీపనిని ఎడమచేతితో చేసేందుకు ప్రయత్నిస్తారు. మస్తిష్కనియంత్రణ అమరిక ఫలితంగా కూడా ఎడమ చేతివాటం ఏర్పడుతుంది. దీనివల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. వీరు అందరిలోకన్నా భిన్నత్వాన్ని, మేధాశక్తిని అధికంగా కలిగి ఉంటారని పలు పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. సమాజంలో ప్రత్యేక నైపుణ్యాలతో పేరు ప్రతిష్ఠలు పొందిన వారిలో చాలామంది ఎడమచేతివాటం వారే.

– అప్పాల చక్రధారి, సీనియర్ పిల్లల వైద్య నిపుణులు, నిర్మల్

లారీ డ్రైవర్‌కు 75 రోజుల జైలు

కాసిపేట: దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సల్పాలవాగు సమీపంలో అజాగ్రత్తగా లారి నడిపి గొర్రెలను ఢీకొట్టిన డ్రైవర్‌కు కోర్టు 75 రోజుల జైలుశిక్ష విధించినట్లు దేవాపూర్ ఎస్సై గంగారాం తెలిపారు. 2021 ఏప్రిల్ 17న తాండూర్ మండలం రేచిని గ్రామానికి చెందిన అగ్గి నడిపి బీరయ్య తన అల్లుడు రాజేశంతో కలిసి గొర్రెల మందను రేచిని నుంచి లక్సెట్టిపేటకు తీసుకెళ్తుండగా సల్పాలవాగు ప్రాంతంలో అల్లంకి వెంకటేషం గొర్రెల మందపై నుంచి లారీ తోలడంతో 9 గొర్రెలు మృతి చెందినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో బెల్లంపల్లి జేఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ముకేష్ మంగళవారం నిందితునికి 75 రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

రైతులను మోసగించిన వ్యక్తి రిమాండ్

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన పలువురు రైతుల వద్ద గతంలో పంట కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా తప్పించుకు తిరుగుతున్న రతన్ అనే వ్యక్తిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీసాయి తెలిపారు. మూడేళ్ల క్రితం పలువురు రైతుల వద్ద జొన్న, సోయాపంటను కొనుగోలు చేశాడు. రైతులకు రావాల్సిన రూ.11 లక్షలు ఇవ్వకుండా మోసం చేశారని ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'నవోదయ' దరఖాస్తులకు నేడే ఆఖరు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి నిర్వహించనున్న అర్హత పరీక్ష దరఖాస్తులకు నేడు బుధవారం చివరి గడువని ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ మంగళవారం తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలవారు ఆన్‌లైన్‌లో లేదా నవోదయ విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాలినడకన వెళ్లి..చికిత్స అందించి


బొజ్జుగూడకు కాలినడకన వెళ్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: ఏజెన్సీలో కొలాం గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం పీఎం జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా వైద్య సిబ్బందిని నియమించింది. సదరు వైద్యసిబ్బంది మంగళవారం మండలంలోని కొత్తపల్లి (హెచ్) కొలాంగూడ నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భీంపూర్ బొజ్జుగూడ (కొలాంగూడ) గ్రామానికి కాలినడకన వెళ్లి ఇంటింటా వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి చికిత్స అందించారు. 15 రోజులకు ఒకసారి కొలాం గ్రామాన్ని సందర్శించి వైద్య సేవలు అందిస్తామని స్టాఫ్‌నర్స్ జంగుబాయి తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆమె వెంట ఎల్‌టీ గంగాదేవి, పారామెడికల్ అసిస్టెంట్ సావిత్రిబాయి, ఆశ కార్యకర్త లక్ష్మీబాయి, తదితరులు ఉన్నారు.

కొలాం గిరిజనుల విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు


పాఠశాల ఎదుట ఏటీడీవో క్రాంతికుమార్

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని కొలాం గిరిజనుల విద్యాభివృద్ధికి ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఏటీడీవో క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం కొలాం హబిటేషన్ గ్రామాలైనా కొత్తపల్లి-హెచ్ కొలాంగూడ, భీంపూర్ కొలాంగూడ, బొజ్జుగూడలలో నూతనంగా ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలాం గిరిజన పిల్లలకు మెరుగైన విద్యను అందించాలనే ఉద్దేశంతో పాఠశాలలు ప్రారంభించినట్లు తెలిపారు. సీఆర్‌టీలను నియమించి విద్యాబోధన చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పీఎం జన్‌మన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం బలిరాం, ఎస్‌సీఆర్‌పీ రాజబాబు, విజయ్‌కుమార్, సీఆర్‌టీ రోహిదాస్ చౌహాన్, రామేశ్వర్ రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య


నరేశ్ (ఫైల్)

తాంసి: మద్యం మత్తులో రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పొన్నారిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గుమ్ముల నరేశ్ (31) కూలీ పనులకు వెళ్తూ కుటుంబానికి అండగా ఉండేవాడు. ఈక్రమంలో కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ పోషణకు గ్రామంలో పలువురి వద్ద అప్పులు సైతం చేశాడు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున గ్రామ శివారులో గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ టి.ప్రభాకర్ మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

భైంసారూరల్: జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కుంబి గ్రామానికి చెందిన ఉప్పులవార్ మాధవరావు (49) గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచూస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరు..

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఓ లాడ్జిలో ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన నరేందర్(40)కు పదిహేనేళ్ల క్రితం వాంకిడి మండలానికి చెందిన సంతోషితో వివాహమైంది. ఏడాదిక్రితం అతని భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఒంటరి జీవితాన్ని గడుపుతూ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. మానసికంగా బాధపడుతూ ఊర్లు తిరుగుతుండేవాడు. ఈక్రమంలో కాగజ్‌నగర్‌కు వచ్చి లాడ్జిలో బస చేశాడు. మంగళవారం గదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకున్నాడు. మృతుని సోదరుడు భూంపల్లి ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని జీఎస్ ఎస్టేట్‌లో నివాసముంటున్న ఆనంద్ త్రిపాఠి ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు ఈ నెల 6న ఇంటికి తాళం వేసి మధ్యప్రదేశ్‌కు వెళ్లాడు. సోమవారం సాయంత్రం అతని స్నేహితుడు శివకుమార్ ఇంటి ముందు నుంచి వెళ్తుండగా కిటికి తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. లోపలికి వెళ్లిచూడగా తాళం పగుల గొట్టి ఉండడంతో విషయాన్ని స్నేహితుడికి సమాచారం అందించాడు. లాకర్‌లో ఉన్న రూ.10వేల నగదు, రిస్ట్ వాచ్, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు పేర్కొన్నాడు. శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

జటాశంకర ఆలయంలో..

ముధోల్: మండల కేంద్రంలోని జటాశంకర ఆలయంలో మంగళవారం చోరీ జరిగినట్లు ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపారు. మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని దొంగ ఆలయంలో ఉన్న హుండీ పగుల గొట్టి డబ్బులు ఎత్తుకెళ్ళాడు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ఆలయానికి చేరుకుని పరిశీలించారు. సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్సై తెలిపారు.

వేధింపులతో మహిళ మృతి


మానస (ఫైల్)

తలమడుగు: వేధింపులతో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై రాధిక తెలిపిన వివరాల మేరకు తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన మొట్టె మానస (25)కు అదే గ్రామానికి చెందిన గంపల ప్రశాంత్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. ప్రశాంత్ ఆర్మీలో ఉద్యోగం చేస్తుండడంతో మానసను జమ్మూకశ్మీర్‌కు తీసుకెళ్లాడు. అక్కడ భర్త, అత్తామామలు శారీరకంగా, మానసికంగా వేధించడంతో ఆరోగ్యం క్షీణించింది. దీంతో మహిళ కుటుంబ సభ్యులు కజ్జర్లకు తీసుకువచ్చి ఆదిలాబాద్‌లోని రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి పూర్ణచందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడ సమీపంలో రహదారిపై ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన సాయికుంటకు చెందిన రామటెంకి రాజవ్వ (84) మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వృద్ధురాలు సోమవారం చున్నంబట్టి వాడ సమీపంలో రోడ్డు దాటుతుండగా మంచిర్యాల వైపు నుంచి శ్రీరాంపూర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. రాజవ్వకు తలకు తీవ్రగాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి కూతురు మల్లక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బ్యాంక్ సిబ్బందిపై దాడి!

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఓ ఎలక్ట్రికల్ షాపు యజమాని బ్యాంక్ సిబ్బందిపై దాడికి పాల్పడినట్లు సమాచారం. మంగళవారం బ్యాంక్ రుణానికి సంబంధించి రికవరీ కోసం వెళ్లగా బ్యాంక్ ఉద్యోగులు, షాపు యజమానికి మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో షాపు యజమాని కత్తెరతో దాడి చేసినట్లు తెలుస్తోంది. బాధితుడిని చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్‌ను వివరణ కోరగా.. దీనికి సంబంధించి ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

అదుపుతప్పి వ్యాన్ బోల్తా


బోల్తా పడిన వ్యాన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారులోని నేషనల్‌హైవే బైపాస్ రోడ్డుపై మంగళవారం తెల్లవారు జామున సరుకుల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో రోడ్డుపక్కన బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ సురక్షితంగా బయట పడ్డాడు. ఆ సమయంలో వెనుక నుంచి వాహనాలేవీ రాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

సింగరేణిని పరిరక్షించుకోవాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్



మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

శ్రీరాంపూర్: సింగరేణిని పరిరక్షించుకోవాలని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్ అన్నారు. మంగళవారం నస్పూర్ కాలనీలోని శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, సంస్థ పరిరక్షణకు సేవ్ వర్కర్స్...సేవ్ సింగరేణి కార్యక్రమంలో భాగంగా ఈనెల 14న అన్ని జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా, 22న కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. సింగరేణి యాజమాన్యం తీసుకుంటున్న పలు నిర్ణయాలు కార్మికులకు ఇబ్బందిగా మారాయన్నారు. పర్మినెంట్ ఉద్యోగులను తగ్గించడం, కారుణ్య ఉద్యోగాల కల్పనలో ఇబ్బందులకు గురి చేయడం, 3,600 మందిని విజిలెన్సు కేసుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ వారికి ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. కంపెనీలో కార్మికుల సంఖ్యను కుదించినట్లు అధికారులను ఎందుకు తగ్గించడం లేదన్నారు. సమావేశంలో ఆ యూనియన్ సీనియర్ ఉపాధ్యక్షులు కాంపల్లి సమ్మయ్య, జెట్టి శంకర్రావు, ఉపాధ్యక్షులు గరిగే స్వామి, కలవేన శ్యాం, ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు జీవన్‌జోయల్, తిరుపతి రాజు, అశోక్, మెండె వెంకటి పాల్గొన్నారు.

తొడసం కైలాస్‌కు సన్మానం


తొడసం కైలాస్, కాత్లే మారుతిని సన్మానిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: రాష్ట్రపతి ఆహ్వానం అందుకున్న తొడసం కైలాస్‌ను ఆదివాసీ బిరుదుగోండి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రాంజీగోండ్ భవన్‌లో మంగళవారం సన్మానించారు. గోండిభాషలో మహాభారత్ గ్రంథాన్ని రచించి ఏఐ ద్వారా అనేక పాటలు సృష్టించిన తొడసం కైలాస్‌ను స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి విందుకు ఆహ్వానించినట్లు వారు పేర్కొన్నారు. ఆర్చరీ (విలువిద్య)లో అనేక మందికి శిక్షణనిచ్చి, ఇటీవల పురస్కారం అందుకున్న చించుఘాట్ గ్రామానికి చెందిన కాత్లే మారుతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మర్సుకోలా తిరుపతి, ప్రధాన కార్యదర్శి తొడసం శ్రీనివాస్, గౌరవాధ్యక్షులు పెందూర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ కృష్ణపై కేసు నమోదు

ఇంద్రవెల్లి: రిమ్స్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసగించిన మండలంలోని శంకర్‌గూడకు చెందిన ఎన్ఆర్ఐ, డిజిటల్ మైక్రో ఫైనాన్స్ చైర్మన్ జవాడే కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థి తుంగపిండి ఉదయ్‌కుమార్‌కు కృష్ణతో పరిచయం ఏర్పడింది. మే నెలలో వారింటికి వెళ్లి రిమ్స్‌లో ఏఎన్‌ఎం ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, మీ అమ్మకి ఇప్పిస్తానని చెప్పడంతో జూన్ 3న ఉదయ్‌కుమార్ తన తల్లితో కలిసి ఆదిలాబాద్‌లోని రామ్‌నగర్‌లో ఉన్న డిజిటల్ మైక్రో ఫైనాన్స్ కార్యాలయానికి వెళ్లి రూ.2.30 లక్షలు ఇచ్చాడు. ఆ తర్వాత ఉద్యోగం కోసం పలుమార్లు కార్యాలయానికి వెళ్లగా అక్కడ కృష్ణ కనిపించలేదు. దీంతో మోసపోయానని గుర్తించిన బాధితుడు మంగళవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


వినాయక మండపం కూల్చివేత

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని 21 వార్డు బూడిదగడ్డ బస్తీలో నిర్మిస్తున్న వినాయక మండపాన్ని మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ కృష్ణ , వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాసరావు పరిశీలించి ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అనుమతి లేకుండా మండపం నిర్మించడం సరికాదని నిర్వాహకులకు సూచించారు.

కడెం ప్రాజెక్ట్ రెండు గేట్లు ఎత్తివేత

కడెం: ఎగువన కురుస్తున్న వర్షాలకు కడెం ప్రాజెక్టుకు మంగళవారం రాత్రి 4,812 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరడంతో ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు రెండు వరద గేట్లను ఎత్తి 12,833 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 696.775 అడుగుల వద్ద నీటిమట్టం ఉంది.

యూరియా కోసం రైతుల వెతలు


సహకార సంఘం కార్యాలయం వద్ద క్యూలో రైతులు

తాండూర్: ఖరీఫ్ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగుచేసిన మండల రైతులు యూరియా కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంటల సాగు అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా కాకపోవడంతో నానా తంటాలు పడుతున్నారు. మండల సహకార సంఘానికి ప్రస్తుతం 12 టన్నుల (260 బస్తాలు) యూరియా మాత్రమే సరఫరా అయ్యింది. ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున ఇస్తుండడంతో అన్నదాతలు గంటల తరబడి క్యూలో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని పీఏసీఎస్, హాక రైతు సేవ కేంద్రం, ఫర్టిలైజర్ దుకాణాల్లో గత 10 రోజులుగా యూరియా కొరత ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనులు మానేసి దుకాణాలకు పరుగులు తీస్తున్నారు. కొన్నిషాపుల్లో యూరియా ఉన్న అవసరంలేని మందులతో లింకులుపెట్టి వాటిని అంటగడుతూ ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి యూరియా కొరతలేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.